


నేటి దినపత్రిక

# సూర్య

www.suryaa.com

19 వ వసంతంలోకి ...

కాకినాడ జిల్లా
కోనసీమ జిల్లా
తూర్పు గోదావరి జిల్లా
పోలవరం(రంపచోడవరం)జిల్లా

శుక్రవారం,13 మార్చి 2026 | 8 పేజీలు


## సెక్యూరిటీ గార్డు..సేవకుడా ?

# ఏజెన్సీల బానిసనా?



అలసిపోయిన సెక్యూరిటీ గార్డ్




సెక్యూరిటీ గార్డుల పొట్ట కొట్టి ఏజెన్సీల కోట్ల దందా!

**అర్ధరాత్రి పారిశ్రామిక వాడల చీకటిలో.. గజగజ వణికే చలిలో.. ప్రాణాలకు తెగించి కాపలా కాసే కావలి భటుడు.. పగలు ఎండలో మాడిపోతూ స్కూళ్లు, మాల్స్ ముందు సెల్యూట్ కొట్టే నిరుపేద కార్మికుడు.. వీరంతా మన ఆస్తులకు భద్రత ఇస్తున్నారు కానీ, వారి బతుకులకు మాత్రం భరోసా కరువైంది.**

**రక్షణ ఇచ్చే ఏజెన్సీలే భక్షకులుగా మారి, కార్మికుల రక్తాన్ని జలగల్లా పీలుస్తున్నాయి. వారి శ్రమను పెట్టుబడిగా పెట్టి కోట్లు గడిస్తున్న 'సెక్యూరిటీ మాఫియా' దందాపై ఉమ్మడి గోదావరి జిల్లాల 'సూర్య' బ్యూరో ప్రత్యేక ఇన్వెస్టిగేటివ్ కథనం.**

- 'సెక్యూరిటీ' ముసుగులో పేద ఉద్యోగుల రక్తం తాగుతున్న రాబందులు..
- రూ.20 వేల బిల్లులో ఏడువేల స్వాహా!
- పీఎఫ్, ఈఎస్ఐ దగా..
- కలెక్టర్ పర్యవేక్షణకై దగాపడ్డ ఒక భారీ 'సెక్టార్' వేయికళ్లతో ఎదురుచూపు !

**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య బ్యూరో :**

సెక్యూరిటీ గార్డ్ డ్రెస్సు.. చేతిలో లాఠీ.. కంటి నిండా నిద్రలేని రాత్రులు.. ఇదీ మన ఆస్తులకు రక్షణగా నిలిచే సెక్యూరిటీ గార్డు ముఖచిత్రం!కానీఈ ఖాకీ యూనిఫామ్ వెనుక 'కమీషన్' రాబందులు సాగిస్తున్న నిలువు దోపిడీ అంతాఇంతా కాదు.బాధిత కార్మికుల నుండి సేకరించిన క్షేత్రస్థాయి ఆధారాల ప్రకారం సెక్యూరిటీ ఏజెన్సీల పేరుతో వెలిసిన కొన్ని అక్రమ సామ్రాజ్యాలు నిరుపేద కార్మికుల రక్తాన్ని పిండుకుని కోట్లు గడిస్తున్నాయి. చట్టాలను చుట్టాలుగా మార్చుకుని, అధికారుల కళ్లు గప్పి, పారిశ్రామిక వాడల్లో 'ఆధునిక వెట్టిచాకిరీ'ని సాగిస్తున్న ఈమాఫియా దందాపై ఉక్కు పాదం మోపి... సెక్యూరిటీ గార్డులుగా జీవనం సాగిస్తున్న వారికి కనీస హక్కులు తీర్చాలి.

**రక్తం తాగుతున్న 'కమీషన్' జలగలు!**

జిల్లాలోసెక్యూరిటీ ఏజెన్సీల ముసుగులో జరుగుతున్నది వ్యాపారం కాదు, అక్షరాలా 'మనుషుల శ్రమ దోపిడీ'. పిఎస్ఎఆర్ఏ చట్టం ప్రకారం సర్వీస్ ఛార్జ్ గరిష్టంగా 15% మించకూడదు, కానీ పారిశ్రామిక వాడలు, విద్యాసంస్థల నుంచిఒక్కో గార్డుకు నెలకు రూ. 20,000 వరకు గుంజుతున్న ఏజెన్సీలు, ఆ గార్డు చేతిలో మాత్రం రూ. 13,000 చిల్లర పెట్టి

- తరువాయి 2లో..

## చెత్తతోనూ లాభమే..

# పాత సామాన్లకూ డిమాండ్!

**– రాజ్యసభలో ఎంపీ సానా సతీష్ బాబు ప్రశ్న..**
**కేంద్ర మంత్రి కిర్తి వర్ధన్ సింగ్ సమాధానం**



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్య సూర్య బ్యూరో :** ఇంట్లో పాత సామాన్లు, ప్లాస్టిక్ డబ్బాలు, విరిగిపోయిన కుర్చీలు.. ఇవన్నీ చెత్త అనుకుంటున్నారా? అయితే పొరపాటే! భవిష్యత్తులో వీటన్నింటికీ మంచి డిమాండ్ రాబోతోంది. 'వాడి పారేయడం' కాదు, 'వాడిన దాన్నే మళ్ళీ వాడుకోవడం' అనే కొత్త పద్ధతి వైపు దేశం వేగంగా వెళ్తోంది. రాజ్యసభలో ఆంధ్రప్రదేశ్ ఎంపీ సానా సతీష్ బాబు అడిగిన ప్రశ్నకు సమాధానంగా కేంద్ర పర్యావరణ శాఖ సహాయ మంత్రి కిర్తి వర్ధన్ సింగ్ దేశంలో చెత్త నిర్వహణ ఎలా జరుగుతుందో వివరించారు.

**తయారు చేసిన వాళ్ళదే బాధ్యత!**

మంత్రి చెప్పిన దాని ప్రకారం.. ఇకపై ప్లాస్టిక్ సీసాలు, బ్యాటరీలు, పాత ఫోన్లు, కంప్యూటర్లు అనగా ఈ–వేస్ట్, పాత టైర్లు, వాడిన ఆయిల్, ఇల్లు కట్టినప్పుడు వచ్చే రాళ్ళు, మట్టి, పాత వాహనాలు, అలాగే పరిశ్రమల నుండివచ్చేపారిశ్రామిక వ్యర్థాలు..ఇలాంటి వాటిని పారేయడం కుదరదు. వీటిని తయారు చేసినకంపెనీలే, అవి పాడైపోయిన తర్వాత తిరిగి సేకరించి, వాటితో మళ్ళీ కొత్త వస్తువులు తయారు చేయాలి. దీనికోసం ప్రభుత్వం కొత్త నియమాలు తెచ్చింది. దీనివల్ల పర్యావరణానికి ముప్పు తగ్గుతుంది.

**లెక్కల్లో కనిపిస్తున్న మార్పు..**

కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన లెక్కల ప్రకారం, ఈ కొత్త పద్ధతి వల్ల దేశంలో చెత్త రీసైక్లింగ్ పెరుగుతోంది. 2026 మార్చి 5 నాటికి ఉన్న లెక్కలు ఇవి:
వస్తువులు తయారు చేసే కంపెనీలు: 75,126
– పాత వస్తువులను కొని, కొత్తవి చేసేవాళ్ళు రీసైక్లర్లు: 4,574
– మొత్తం రీసైకిల్ అయిన చెత్త: 417.57 లక్షల మెట్రిక్ టన్నులు!

**మనమూ మారాలి!**

కేవలం ప్రభుత్వ చట్టాలతోనే కాదు, మన అలవాట్లు కూడా మార్చు కోవాలని మంత్రి సూచించారు.– నీరు, కరెంట్ ఆదా చేయాలి.
– ఒక్కసారి వాడి పారేసే ప్లాస్టిక్ వాడటం ఆపేయాలి.
– పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి.

పర్యావరణాన్ని కాపాడటం కోసం పార్లమెంటులో ఎంపీ సానా సతీష్ బాబుగళం విప్పడంపై పెద్దఎత్తున టిడిపిశ్రేణులు, ఆయన అభిమానులు, పర్యావరణవేత్తలు ఆనందం వ్యక్తం చేసారు.

## సమాధుల తోట ముఖద్వారాన్ని

# ఆధునీకరిస్తాం..

**– రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల**




**ధవళేశ్వరం,మేజర్‌న్యూస్ :** ధవళేశ్వరంలోని స్థానిక క్వారీ కెనాల్ రోడ్డు క్రిస్టియన్ బరియల్ గ్రౌండ్ ఎదురుగా ఉన్న సిలువను రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా దాన్ని తొలగించడం జరిగిందని కొన్ని వర్గాల మనో భావాలు దెబ్బతిన్నందున సమాధుల తోట ముఖద్వారాన్ని ఆధునీకరించి దానిపై సిలువ నిర్మాణం చేస్తామని రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి హామీ ఇచ్చినట్లు జి ఎస్ ఆర్ ఫౌండేషన్ అధినేత గాలి సుబ్బరాజు గురువారం సాయంత్రం తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎమ్మెల్యే ఇచ్చిన హామీని తాను పర్యవేక్షించి పూర్తి చేస్తానన్నారు. అలాగే అక్కడ ఉన్న అన్ని అక్రమ నిర్మాణాలను వీలైనంత త్వరగా తొలగించమనీ అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించినట్లు కూడా చెప్పారు. ఆప్రాంతంలో మార్కింగ్ చేసిన ఒక ఇంటికి సంబంధించిన యజమాని కోర్టును ఆశ్రయించడంతో కూల్చివేత ఆగిందని దానిని కూడా చట్ట పరంగా చర్యలు తీసుకుని

- తరువాయి 2లో..

# సెక్యూరిటీ గార్డు.. సేవకుడా? ఏజెన్సీల బానిసనా?







**మొదటిపేజి తరువాయి**

నోరు మూయిస్తున్నాయి. అంటే ఒక్కో కార్మికుడి కడుపు కొట్టి నెలకు రూ.7,000 నుండి రూ.8,000 వరకు యజమాని జేబులోకి వెళ్తోంది. కష్టపడి పని చేసేవాడికి కన్నీళ్లే మిగులుతుంటే, ఏసీ గదుల్లో కూర్చునే యజమానులు విలాసవంతమైన భవనాలు కట్టుకుంటున్నారు. ఇది ఆర్థిక నేరం కాదా? అని కార్మిక లోకం ప్రశ్నిస్తోంది.

**12 గంటల నరకం.. ఎముకలు కుళ్లుతున్నా తప్పని చాకిరి!**

ప్రభుత్వ నిబంధనలు 8 గంటల పని అంటున్నా, ఈ పారిశ్రామిక వాడల్లో గార్డులు 12 గంటల పాటు రోబోల్లా పని చేయాల్సిందే. కనీస వేతనాల చట్టం ఇక్కడ అపహాస్యం పాలవుతోంది.

– విశ్రాంతి లేని జీవితం: నిలబడేలా ఉండాలి.. నిరంతరం గమనిస్తూనే ఉండాలి.

– హక్కుల హరణం: వారానికి ఒక సెలవు లేదు, పండగ పూట కుటుంబంతో గడిపే భాగ్యం లేదు.

– ఓవర్ టైందగా: అదనంగా పని చేయించుకున్న గంటలకు పైసా ఇవ్వకుండా, కార్మికుడి శక్తిని పిండుకుంటున్నాయి ఏజెన్సీలు. ఈ ఆధునిక వెట్టిచాకిరీలో ఆరిపోతున్న బతుకుల గోడు వినే నాథుడే లేడు.

**పీఎఫ్, ఈఎస్ఐ గారడీ.. 'భద్రత' లేని బతుకులు!**

చాలా సంస్థలు పీఎఫ్, ఈఎస్ఐ కట్ చేస్తున్నామని నమ్మిస్తూ, ఆ సొమ్మును ప్రభుత్వానికి కట్టకుండా 'స్వాహా' చేస్తున్నాయి.

– వైద్యం అందని ద్రాక్ష: పారిశ్రామిక వాడల్లో ప్రమాదకర యంత్రాల మధ్య, కాలుష్యం మధ్య పనిచేస్తూ అనారోగ్యం పాలైతే ఆదుకోవాల్సిన ఈఎస్ఐ కార్డు ఒక్క గార్డు దగ్గర కూడా లేదు.

– భవిష్యత్తు శూన్యం: ఏళ్లుగా పని చేస్తున్నా, తమ పీఎఫ్ ఖాతాలో ఒక్క రూపాయి కూడా జమ కావడం లేదని తెలిసి కార్మికులు బెంబేలెత్తుతున్నారు. ఇది కేవలం మోసం కాదు, ఒక నిరుపేద కుటుంబం భవిష్యత్తును ఖూనీ చేయడమే!

**అధికారులు మామూళ్ల మత్తులో ఉన్నారా?**

ఇంత పచ్చిగా దోపిడీ జరుగుతున్నా లేబర్ డిపార్ట్‌మెంట్, ఈఎస్ఐ, పిఎఫ్ అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారు?

– తనిఖీల పేరుతో ఏజెన్సీల ఆఫీసులకు వెళ్లి, వారు ఇచ్చే 'అతిథి మర్యాదల'కు తలొగ్గి అక్రమాలకు వత్తాసు పలుకుతున్నారా?

– ఒక్కో ఏజెన్సీ కింద 500 మందికి పైగా సెక్యూరిటీ గార్డులుగా పని చేస్తున్నారంటే, ఏటా ఎంత భారీ కుంభకోణం జరుగుతోందో అధికారులకు తెలియదా?

– కాగితాల మీద లెక్కలు సరిచూసుకోవడం కాదు.. నేరుగా గార్డుల బ్యాంక్ ఖాతాలను ఎందుకు తనిఖీ చేయడం లేదని 'సూర్య' నిలదీస్తోంది.

**నిగ్గు తేల్చాల్సిన ప్రశ్నలు:**

– కార్మికుడి కష్టార్జితంలో 40 శాతం కమిషన్ తీసుకోవడం ఏ చట్టంలో ఉంది?

– పారిశ్రామిక వాడల్లో ప్రాణాలకు తెగించి పనిచేసే గార్డుల జీవితాలకు భరోసా ఏది?

– అక్రమ ఏజెన్సీలపై జిల్లా కలెక్టర్ ఉక్కుపాదం మోపేది ఎప్పుడు?

సెక్యూరిటీ గార్డు అంటే కేవలం యూనిఫామ్ వేసిన కావలివాడు కాదు.. ఒక కుటుంబానికి ఆధారం. వారి కడుపు కొట్టి కోట్లు గడిస్తున్న ఏజెన్సీల లైసెన్సులు రద్దు చేసి, నేరుగా వారి ఖాతాల్లోనే జీతాలు పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని బిజెపి నాయకులు, మేధావులు డిమాండ్ చేస్తున్నారు.

# అంబేడ్కర్ భవనం, 50 అడుగుల విగ్రహం, లైబ్రరీ నిర్మిస్తా

**– జ్యోతుల నెహ్రూ**



**జగ్గంపేట, మేజర్ న్యూస్ :** నియోజవర్గ కేంద్రమైన జగ్గంపేట పోలవరం కాలువ వద్ద అంబేడ్కర్ భవనం 50 అడుగుల విగ్రహం డిజిటల్ లైబ్రరీ నిర్మిస్తానని స్థానిక శాసనసభ్యులు జ్యోతుల నెహ్రూ అన్నారు. బుధవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎస్సీ కులస్తులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ భవనం కోసం మీరు ఎన్నో ఉద్యమాలు చేస్తున్నారని జగ్గంపేట నియోజకవర్గంలో అంబేడ్కర్ భవనం ఏర్పాటు చేస్తామన్నారు. అంతేకాకుండా తప్పనిసరిగా భవనంతో పాటుగా 50 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని కూడా ఏర్పాటు చేస్తున్నానని నీకు హామీ ఇచ్చారు.

జ్యోతుల ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ డిజిటల్ లైబ్రరీని కూడా ఏర్పాటు చేస్తానని ఆ లైబ్రరీ ద్వారా ఎంతోమంది విద్యార్థులు విద్యావేత్తలుగా తయారవుతారని దానివలన సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో అంబేడ్కర్ భవనం పోరాట కమిటీ నాయకులు రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా సౌత్ ఇండియా జనరల్ సెక్రెటరీ పులి ప్రసాద్ దళిత ప్రజాశక్తి వ్యవస్థాపక అధ్యక్షులు మురారి రవికుమార్ బహుజన్ సమాజ్ పార్టీ కాకినాడ జిల్లా అడ్వైజర్, జుత్తుక నాగేశ్వరరావు నియోజకవర్గం ఇన్చార్జ్ సాదే నరేంద్రబాబు, మాజీ ఎంపిపి దారా ఏసురత్నం, జగ్గంపేట మండల ఎస్ సి సెల్ అధ్యక్షులు సాంబత్తుల చంద్రశేఖర్, గొల్లపల్లి చక్రధర్ పాల్గొన్నారు.

# నేర రహిత సమాజమే లక్ష్యంగా పిఠాపురం పోలీసులు అడుగులు

**– పిఠాపురం సిఐ జి.శ్రీనివాస్**



**పిఠాపురం, మేజర్ న్యూస్ :** నేర రహిత సమాజమే లక్ష్యంగా పిఠాపురం పోలీసులు అడుగులు వేస్తున్నారు. మంగళవారం సాయంత్రం పిఠాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్ జి.శ్రీనివాస్ పట్టణంలోని పాదగయ జంక్షన్ వద్ద ఆటో డ్రైవర్లతో సమావేశమయ్యారు. పెరిగిపోతున్న సాంకేతిక నేరాల పట్ల మరియు రోడ్డు భద్రత పట్ల ఆయన స్వయంగా మైకు పట్టుకుని డ్రైవర్లకు దిశానిర్దేశం చేశారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కలకలం రేపుతున్న 'డిజిటల్ అరెస్ట్' మోసాల గురించి సి.ఐ వివరించారు.

భయం మరియు ఆశను ఎరగా చూపే సైబర్ మోసగాళ్ల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆటో డ్రైవర్లను కోరారు. మోటార్ సైకిళ్లు, ఆటోలు మరియు సెల్ ఫోన్ల దొంగతనాలకు తావు లేకుండా వాహనదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం వల్ల ప్రమాదాలు జరుగుతాయని, ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రాణ నష్టాన్ని నివారించవచ్చని స్పష్టం చేశారు. ఆటో డ్రైవర్లు నిరంతరం ప్రజల మధ్య ఉంటారు కాబట్టి, పట్టణంలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

ఈ కార్యక్రమంలో పిఠాపురం సర్కిల్ పోలీస్ సిబ్బంది మరియు భారీ సంఖ్యలో ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

# సమాధుల తోట ముఖద్వారాన్ని ఆధునీకరిస్తాం..

**మొదటిపేజి తరువాయి**

అధికారులు కూల్చివేతను చేపడతారని కూడా వివరించారు. ఎమ్మెల్యే గోరంట్ల అన్ని వర్గాలకు సంబంధించి న్యాయం చేస్తారని సుబ్బరాజు పేర్కొన్నారు. అందరూ సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. కాగా ఈసమావేశంలో ఎన్.ఎం.ఇ లూథరన్, పాస్టర్ గుర్రపు కిరణ్ బాబు, ధవలేశ్వరం వేమగిరి బొమ్మూరు పాస్టర్ల అసోసియేషన్ ప్రెసిడెంట్ జి జోసెఫ్, ఇంకా ఫెలోషిప్ సభ్యులు పాల్గొన్నారు.

# భూమి రీ సర్వేకు రైతులు సహకరించాలి

**– తాసిల్దార్ సత్యనారాయణ**



**రాజకొమ్మంగి, మేజర్ న్యూస్ :** హక్కుదారులు భూ రీ సర్వేకు సహకరించాలని తాసిల్దార్ సత్యనారాయణ కోరారు. మండలం ఉర్లాకులపాడు గ్రామంలో గురువారం తహసీల్దార్ అల్లు సత్యనారాయణ ఆధ్వర్యంలో భూ సర్వే పనులు ప్రారంభించారు. మాజీ జడ్పీటీసీ బుజ్జి చిన్నాలమ్మ టెంకాయ కొట్టి సర్వే పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సొసైటీ అధ్యక్షుడు గణజాల తాతారావ్, గ్రామస్థులు అవూరి వెంకట్రావు, కోసూరి రాముడు, జర్తా నల్లబ్బాయి, కోసూరి ఎగులమ్మ, తెలుగు యువత మండల నాయకులు కించి వెంకటరమణ, కోసూరి లోవ వీరవెంకటరెడ్డి, పీసా ప్రధాన కార్యదర్శి కోసూరి వీరబాబు మరియు రెవెన్యూ వీఆర్వో నానాజీ, సర్వేయర్ లు పాల్గొన్నారు. రెవెన్యూ అధికార్లు మాట్లాడుతూ గ్రామానికి చెంది 1100ఎకరాల భూమి, రీ సర్వే చేయాల్సి ఉందని ప్రతీ రైతు వారి పొలాల వద్ద ఉండి సర్వేకు సహకరించాలన్నారు.

# హెచ్పీవీ టీకాలు వేసిన వైద్య సిబ్బంది



**అడ్డతీగల, మేజర్‌న్యూస్ :** ఏజెన్సీ అడ్డతీగల మండలంలోని ఎల్లవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నందు గురువారం డాక్టర్ దేవి ప్రియాంక ఆధ్వర్యంలో 14 నుండి 15 సంవత్సరాల లోపు గల బాలికలకు హెచ్పీవీ టీకాలను వేసినట్లు వైద్య సిబ్బంది పేర్కొన్నారు. ఈ టీకాలు వేయడం వల్ల యుక్త వయసు వచ్చిన తర్వాత ఆడవాళ్ళల్లో వచ్చే గర్భాశయం ముఖద్వారా క్యాన్సర్ రాకుండా కాపాడుతుందని డాక్టర్ దేవి ప్రియాంక తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని 14- 15 వయసుగల బాలికలంతా ఈ టీకాలు వేయించుకోవాలని సూచించారు. గురువారం 13మంది బాలికలకు ఈ టీకాలు వేసినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ఎం.సత్యవతి , పి.సత్యవతి, మంగాయమ్మ, పుష్ప కుమారి పాల్గొన్నారు.

# జనసేన ఆవిర్భావ దినోత్సవానికి ఏర్పాట్లు పూర్తి



**అడ్డతీగల, మేజంన్యూస్ :** ఈనెల 14వ తేదీ శనివారం నాడు జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ సంబరాలకు అడ్డతీగల మండలంలోని కార్యకర్తలంతా సిద్ధంగా ఉండాలని రంపచోడవరం నియోజకవర్గ జనసేన నాయకుడు మరియు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రోగ్రామింగ్ కమిటీ మెంబర్ తాటికొండ రాజేంద్ర పిలుపునిచ్చారు. 14వ తేదీ ఉదయం స్థానిక బస్టాండ్ వద్ద గల జనసేన స్తూపం వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమంతో పాటు కేక్ కటింగ్ జరప నున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జనసైనికులు వీర మహిళలు, భారీ ఎత్తున హాజరై విజయవంతం చేయాలని సూచించారు.

# ఘనంగా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవ వేడుక



రావులపాలెం,మేజర్‌న్యూస్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 16వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రావులపాలెం మండల వ్యాప్తంగా వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.ముందుగా రావులపాలెం వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, పార్టీ ఆవిర్భావ దినోత్సవ కేక్‌ను కట్ చేశారు. అనంతరం దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, అనంతరం కేక్ కట్ చేసి స్వీట్‌లు, పండ్లు, బ్రెడ్స్ మరియు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం జగిరెడ్డి మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను కొనసాగిస్తూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రజల కోసం పని చేస్తుందని తెలిపారు. అలాగే ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో ముందుకు సాగిందని పేర్కొన్నారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని, రాబోయే రోజుల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వైభవంగా శ్రీ నూకాలమ్మవారి గరగల జాతర



**అన్నవరం, మేజర్ న్యూస్ :** అన్నవరం గ్రామంలోని నాయి బ్రాహ్మణుల కాలనీలో శ్రీ నూకాలమ్మవారి గరగల జాతర మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమైంది. దశాబ్దాలుగా వస్తున్న ఆచారాన్ని కొనసాగిస్తూ, కాలనీలోని రామాలయం వద్ద ఈ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటలకు అమ్మవారి ప్రతిరూపమైన 'గరగ'ను మోసే పూజారిని అమ్మవారి ప్రతినిధిగా భావించి, శాస్త్రోక్తంగా శ్రీ నూకాలమ్మవారిని ఆహ్వానించారు. కాలనీలోని భక్తులు తమ తమ ఇళ్ల వద్ద అమ్మవారికి ప్రత్యేకంగా పాన్పులు వేసి, ధూపదీప నైవేద్యాలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గరగను దర్శించుకుని భక్తి పారవశ్యంతో ప్రార్థనలు నిర్వహించారు.

బుధవారం రాత్రి 9 గంటల నుండి రామాలయం వద్ద జాతర ప్రారంభమైంది. అర్ధరాత్రి 12 గంటల వరకు కొనసాగిన ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులయ్యారు. అన్నవరం గ్రామంలో పూర్వం ఒకే చోట నివసించిన నాయి బ్రాహ్మణులందరూ, కాలక్రమంలో నందమూరి తారక రామారావు కేటాయించిన స్థలాలలో స్థిరపడ్డారు. ఈ కాలనీ ఏర్పడిన నాటి నుండి నేటి వరకు ప్రతి సంవత్సరం సంప్రదాయం తప్పకుండా ఈ ఉత్సవాన్ని నిర్వహించడం విశేషం. పూర్వీకుల నుండి వస్తున్న ఈ సంస్కృతిని కాపాడుకుంటూ ఐకమత్యంతో ఈ వేడుకను జరుపుకుంటున్నట్లు కాలనీ ప్రతినిధులు తెలిపారు.

# పరీక్షలపై భయం విడనాడాలి

# - ఆత్మవిశ్వాసముతో విజయం సాధించాలి

**- 10వ తరగతి విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖీలో వనమాడి కొండబాబు**



**కాకినాడ, మేజర్ న్యూస్ : విద్యార్థులు** పరీక్షలను భయంతో కాకుండా ఆత్మవిశ్వాసంతో ఎదుర్కొని విజయాన్ని సాధించాలని కాకినాడ సిటీ కాకినాడ సిటీ శాసనసభ్యులు వనమడి కొండబాబు పేర్కొన్నారు. 10వ తరగతి విద్యార్థుల్లో పరీక్షలపై ధైర్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించేందుకు "నా పరీక్ష – నా విజయం" పేరుతో 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం విద్యార్థిలకు పదో తరగతి హాల్ టికెట్స్ కొండబాబు చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా జగన్నాధపురం చర్చ్ స్క్వేర్ గర్ల్స్ హైస్కూల్, సాలిపేట గర్ల్స్ హైస్కూల్, గాంధీ నగర్ మున్సిపల్ హైస్కూల్లను సందర్శించి 10వ తరగతి విద్యార్థులతో ప్రత్యేకంగా ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ పరీక్షలు జీవితంలో ఒక ముఖ్యమైన దశ మాత్రమేనని, విజయం సాధించడానికి క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మవిశ్వాసం అవసరమని, ప్రతి విద్యార్థి తన లక్ష్యాన్ని స్పష్టంగా నిర్ణయించుకుని కష్టపడి ప్రయత్నిస్తే తప్పకుండా విజయాన్ని అందుకోగలరని, పరీక్షల పట్ల భయం విడనాడి, కష్టపడి చదివి ధైర్యంగా పరీక్షలు రాసి విజయం సాధించాలని విద్యార్థులకు సూచించారు. ఈకార్యక్రమానికి జిల్లా విద్యాశాఖాధికారి డివైఈవో కె.వి.వి.సత్యనారాయణ, ఎంఈవో టి.జి.సుబ్బారావు, సిహెచ్.రవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.రాధా కుమారి, పుష్పగిరి, పి.వి.వి. సత్యనారాయణ రాజు, ఉపాధ్యాయ సిబ్బంది, స్థానిక నాయకులు మైలపల్లి విద్యాసాగర్, చొక్కా గిరి, అరదాడి శివ, పసుపులేటి వెంకటేశ్వరరావు, గోపిశెట్టి బూరయ్య, జొన్నాడ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## అన్నవరంలో మిన్నంటిన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ వేడుకలు



అన్నవరం,మేజర్‌న్యూస్ : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని అన్నవరం గ్రామంలో పార్టీ శ్రేణులు సంబరాలు ఘనంగా నిర్వహించాయి. గురువారం స్థానిక కె.కె. గ్రాండ్ వద్ద గ్రామ పార్టీ అధ్యక్షులు ఆశిన శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమంలో భాగంగా పార్టీ సీనియర్ నాయకులు గునూరి పోతురాజు, చల్లా వీర్రాజు, మరియు దోమాడ రాంబాబు చేతుల మీదుగా కేక్ కటింగ్ చేయించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంలో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో పార్టీ వైస్ ప్రెసిడెంట్ బొబ్బిలి వెంకన్న, కొండపల్లి అప్పారావులతో పాటు వార్డు మెంబర్లు సింగంపల్లి రాము, కొండి సూరిబాబు, బత్తుల రవి, అల్లాడ సూరిబాబు, ఈర్లు శ్రీను, బి.ఎస్.వి.ప్రసాద్, నాయుడు, గణేశుల బాబ్జీ, అరిగెల తాతయ్య దొర మరియు ఇతర వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, అభిమానులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## శివాలయం ఆలయ పునఃనిర్మాణానికి విరాళాలు





**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** ఆత్రేయపురం గ్రామంలో వేంచేసియున్న రాజరాజేశ్వరి వేణుగోపాలస్వామివారి ఆలయ పునఃనిర్మాణానికి గ్రామానికి చెందిన చిలువూరి లక్ష్మీపతిరాజు, నాగ సుందర లక్ష్మి దంపతుల పేరు మీద వారి కుమారుడు కాశి విశ్వనాథరాజు రూ.5 లక్షలు; ముదునూరి నారాయణరాజు, శకుంతలమ్మ పేరు మీద వారి కుమారుడు ముదునూరి మురళి కృష్ణంరాజు రూ.5 లక్షలు విరాళాలుగా వాడపల్లి దేవస్థానం చైర్మన్ ముదునూరి వెంకటరాజు, సొసైటీ అధ్యక్షులు ముదునూరి రాంబద్ర రాజు, ఆలయ చైర్మన్లు వేగేశ్న ప్రసాదరాజు, పులవర్తి కాశి లకు అందించారు.

## వెంకన్న నిత్య అన్నదాన పథకానికి విరాళం



**ఆత్రేయపురం, మేజర్ న్యూస్ :** కోనసీమ తిరుమల వాడపల్లి వెంకటేశ్వర స్వామివారి నిత్య అన్నదాన పథకానికి గురువారం హైదరాబాద్, అశోకనగర్‌కు చెందిన ఎడమడకల హరికృష్ణ, శ్రావణి దంపతులు రూ.51,116లు విరాళంగా సమర్పించినారు. వీరికి అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి స్వామి చరిత్ర గురించి వివరించారు. చైర్మన్ ముదునూరి వెంకటరాజు, డిప్యూటీ కమిషనర్ నల్లం సూర్య చక్రధర్ రావు, అర్చకులు స్వామివారి చిత్రపటాన్ని అందించారు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com
మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా...
సంప్రదించండి సెల్ : 9989800678
అతి తక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరు మార్పు, లీగల్ ప్రకటనలకు, మీ కార్యక్రమాలకు సంబంధించిన వార్తలు ఏవైనా సరే
సంప్రదించండి. సెల్ : 9032209779

# జిల్లాలో వినియోగదారుల అవసరాలకు సరిపడా పూర్తి స్థాయిలో ఎల్పీజీ నిల్వలు అందుబాటులో ఉన్నాయి

**- సోషల్ మీడియాలో వస్తున్న పుకార్లు నమ్మి అపోహలు, ఆందోళనలకు గురికావద్దు**
**- ఎల్పీజీ గ్యాస్ పంపిణీపై పర్యవేక్షణ, ఫిర్యాదుల పరిష్కారానికి డిఎస్ఓ కార్యాలయంలో 8886903611 నెంబరుతో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు**
**- జిల్లా జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్**




**కాకినాడ, మేజర్ న్యూస్ :** మధ్యప్రాచ్య దేశాలలో నెలకొన్న యుద్ధ పరిస్థితుల నేపద్యంలో జిల్లాలో వినియోగదారుకు వంటగ్యాస్ సరఫరా పరంగా ఎటువంటి ఇబ్బందులు కలుకుండా అన్ని చర్యలు పటిష్టంగా చేపట్టామని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ తెలియజేసారు.

గురువారం కలెక్టరేట్ వివేకానంద సమావేశ హాలులో జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్, జిల్లా పౌర సరఫరాల అధికారి ఆర్.ఎస్.ఆర్.రాజుతో కలిసి మీడియా ప్రతినిధులతో సమావేశం నిర్వహించి జిల్లాలో వంటగ్యాస్ నిల్వల పరిస్థితి సరఫరా, వినియోగదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చేపట్టిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇరాన్ మరియు ఇజ్రాయిల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ పరిస్థితుల మూలంగా గ్యాస్ నిల్వలు తగ్గి, ధరలు పెరగుతాయని సోషల్ మీడియాలో వస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి వినియోగదారులు ఎవరు ఆందోళన చెందవద్దని కోరారు. జిల్లాలో వినియోగదారులు అవసరాలకు తగిన ఎల్పీజీ నిల్వలు వివిద ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల చెందిన 45 ఎల్పీజీ డీలర్ల వద్ద ఉన్నాయని, ప్రభుత్వం నిర్ధేశించిన బుకింగ్ సైకిల్ ప్రకారం పంపిణీలో గృహావసర వినియోగదాలకే ప్రాధ్యత నిస్తున్నామని తెలిపారు. జిల్లాలో డొమెస్టిక్ ఎల్పీజీ వినియోగదారులకు పంపిణీ చేసేందుకు రోజుకు సగటున 11,000 సిలిండర్లు అవసరమై ఉండగా, డీలర్ల వద్ద 14,756 సిలిండర్లు అందుబాటులో ఉన్నాయని, వినియోగదారులకు ఫస్ట్ ఇన్ - ఫస్ట్ అవుట్ విధానంలో వాటిని పంపిణీ చేయడం జరుగుతోందని తెలిపారు. రోజువారీ నిల్వలు, బుకింగ్, పంపిణీ వివరాలను పారదర్శంగా ఏజెన్సీలలో ప్రదర్శించాలని డీలర్లను ఆదేశించామని, అలాగే ఆర్డిఓలు, తహశిల్దారులు 21 మండలాల్లో గ్యాస్ ఏజెన్సీలను నిత్యం తనిఖీ చేసి గ్యాస్ నిల్వపై ప్రజలకు అవగాహన కల్పించి సోషల్ మీడియా అసత్య ప్రచారల వల్ల ప్రజలలో కలుగుతున్న అపోహలను తొలగిస్తున్నారని జెసి తెలిపారు. సిలిండర్ల పంపిణీకి సంబంధించి వినియోగదారులు ఎవరికైనా, ఎటువంటి ఇబ్బందులు ఎదురైనా డిఎస్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబరు 8886903611 కు తెలియజేస్తే వెంటనే చర్యలు చేపట్టి పరిష్కరిస్తున్నామన్నారు. విశాఖపట్నంలో ఉన్న బోటిలింగ్ యూనిట్లలో సిలిండర్లు నింపే ప్రక్రియ పూర్తి సామర్థ్యంతో జరుగుతోందని, జిల్లాకు సిలిండర్లు ఎటువంటి అంతరాయం లేకుండా సరఫరా అవుతున్నాయని తెలియజేశారు. ఎల్పీజీ సిలిండర్ల సరఫరా, నిల్వలు, పంపణీ అంశాలను తాను స్వయంగా రోజూ ఆయిల్ కంపెనీలు, ఎల్పిజీ డిస్ట్రిబ్యూటర్లతో పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నాని జెసీ తెలియజేశారు. గృహ వినియోగదారులతో బాటు సంక్షేమ హాస్టళ్లు, ఆసుపత్రులకు కూడా ప్రాధాన్యతగా గ్యాస్ సరఫరా చేస్తున్నామన్నారు.జిల్లాలో వంటగ్యాస్ సరఫరా సజావుగా జరుగుతోందన్నారు. ఎల్పీజీ నిల్వలు, పంపిణీ గురించి ప్రభుత్వ అధికారిక మార్గాల ద్వారా విడుదల చేస్తున్న సమాచారాన్ని మాత్రమే విశ్వసించాలని, పుకార్లను నమ్మి అనవసరమైన అపోహలు, ఆందోళనలతో పానిక్ బయింగ్ చేయవద్దని, అవసరం ఉన్నపుడే సిలిండర్లు కొనుగోలు చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ అపూర్వ భరత్ వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

# శ్రీవారి లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉండదు



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో ఉన్న గోవిందగిరిపై శ్రీవారి భక్తులకు ఈ నెల లడ్డూ ప్రసాదం అందుబాటులో ఉండదని ఆలయ అధికారులు గురువారం తెలియజేసారు. పోలవరం జిల్లా కేంద్రమైన రంపచోడవరం మండలంలో ఐ.పోలవరం గోవిందగిరిపై తిరుమల తిరుపతి దేవస్థానం వారు నిర్మించిన శ్రీవేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రంలో ప్రతీ నెలా రెండో శనివారం తిరుమల తిరుపతి నుండి వచ్చే శ్రీవారి లడ్డూ ప్రసాదం ఈ నెల కొన్ని అనివార్య కారణాల రావడం లేదన్నారు. రాష్ట్రంలో తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహణలో ఉన్న అన్ని ఆలయాలకు లడ్డూ ప్రసాదం పంపిణీ జరగదన్నారు. శ్రీవారి లడ్డూ ప్రసాదం డిమాండుకు సరిపడా ఉత్పత్తి లేనందున ఈ నెల సరఫరా నిలిచిపోయినట్టు తి.తి.దే. ఉన్నతాదికారులు చెప్పారని గోవిందగిరి ఆలయ అధికారి రూపు శాయి తెలిపారు. భక్తులు ఈ విషయాన్ని గమనించి, సహకరించాలని గోవిందగిరి శ్రీవారి సేవా బృందం కో-ఆర్డినేటర్ నల్లమిల్లి వేంకటరామారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# ఘనంగా వైస్సార్ సీపీ 16వ ఆవిర్భావ దినోత్సవం



**ఎటపాక, మేజర్ న్యూస్ :** వైస్సార్సీపీ 16వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎమ్మెల్సీ అనంతబాబు, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్చార్జ్ నాగులపల్లి ధనలక్ష్మి ఆదేశాల మేరకు, పోలవరం జిల్లా ఎటపాక మండల కమిటీ ఆధ్వర్యంలో ఎటపాకలోని రాజుపేట గ్రామంలోని మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం వద్ద మండల వైఎస్ఆర్సిపి ఉపాధ్యక్షులు శీలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా 16వ ఆవిర్భావ దినోత్సవం వేడుకలను నిర్వహించడం జరిగింది. మొదటగా డాక్టర్ వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి జడ్పిటిసిఉబ్బాసుస్మిత, ఎంపిపి కాక కామేశ్వరి పూలమాలలు వేసి నివాళులు అర్పించి, వైస్సార్సీపీ జండాను ఆవిష్కరించారు. అనంతరం ఎటపాక మండల కమిటీ ఆధ్వర్యంలో వైఎస్ఆర్సిపి కేక్ కట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఎటపాక జడ్పిటిసి ఉబ్బా సుస్మిత, ఎటపాక ఎంపీపీ కాక కామేశ్వరి, వైస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి కురినాల వెంకటేశ్వర్లు, గుండాల ఎంపిటిసి గొంగడి వెంకటరామిరెడ్డి, మండల ఉపాధ్యక్షులు శీలం నాగేశ్వరరావు, మండల యువజన విభాగం అధ్యక్షులు తోట శశి కుమార్, మండల కార్యదర్శి దాసరి నరేష్, మండల ప్రచార అధ్యక్షులు ముత్తిబోయిన రాము, కన్నాయిగూడెం గ్రామ కమిటీ అధ్యక్షులు చల్లా మణి, ఎటపాక గ్రామ కమిటీ అధ్యక్షులు ముర్రం ముత్తయ్య, కార్యదర్శి పూనెం వీరాస్వామి, విద్యార్థి విభాగం మండల అధ్యక్షులు మై సాక్షి రాకేష్, ఎటపాక వార్డు మెంబర్ గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ మెంబర్ గుమ్మడి నాగమణి, సీనియర్ నాయకురాలు, ఎగ్జిక్యూటివ్ మెంబర్ గజ్జల ఆదిలక్ష్మి, వైస్సార్ విగ్రహ దాత ధనపాల గోపమ్మ, సీనియర్ నాయకులు ఎటపాక కార్యదర్శి శీలం కృష్ణ, గ్రామ కమిటీ కార్యదర్శులు మాచర్ల బాబురావు, సజ్జా సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

## గొల్లప్రోలులో ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్లు



**గొల్లప్రోలు, మేజర్ న్యూస్ :** ఉచిత హెచ్‌పీవీ వ్యాక్సినేషన్లను గొల్లప్రోలు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు చిట్టా మధు, ఇతర బిజెపి నాయకులు, వైద్యులు బాలికలకు అవగాహన కల్పించారు. ప్రాణాంతకమైన గర్భాశయ క్యాన్సర్ నుండి రక్షణ కల్పించేందుకు 14 నుండి 15 ఏళ్ల లోపు బాలికలకు ఈ వ్యాక్సిన్ అందిస్తున్నారు. మార్కెట్లో సుమారు రూ.4,500 విలువ చేసే ఈ శక్తివంతమైన టీకాను మోదీ ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. దేశవ్యాప్తంగా కోటి 15 లక్షల మందికి, ఆంధ్రప్రదేశ్‌లో సుమారు 3.45 లక్షల మంది బాలికలకు ఈ పథకం ద్వారా లబ్ధి చేకూరనుందన్నారు.ఈ సందర్భంగా డాక్టర్ కీర్తన మరియు బిజెపి నాయకుడు చిట్టా మధు మాట్లాడుతూ, “ప్రధాని నరేంద్ర మోదీ మహిళల ఆరోగ్యానికి పెద్దపీట వేస్తూ మరో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. ఏటా వేల సంఖ్యలో మహిళలు గర్భాశయ క్యాన్సర్ బారిన పడి మరణిస్తున్నారని, ఈ మహమ్మారిని అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత టీకా మహిళా శక్తికి ఒక ఆరోగ్య కవచంలా మారుతుందన్నారు. ఈ అద్భుతమైన అవకాశం కల్పించిన ప్రధానికి ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయకులు మలిరెడ్డి నారాయణరావు, కర్రి సత్యనారాయణ, పట్టణ ఉపాధ్యక్షుడు మేడసాని కామరాజు, కార్యదర్శి గారాపాటి సత్తిబాబు, ఓబీసీ విభాగం నేత ఈపు వెంకటరమణ, ఆసుపత్రి సిబ్బంది, విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఏజెన్సీలో మత్స్య సంపద అభివృద్ధికి చర్యలు

**- ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి**



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా పరిధిలోని గిరిజన గ్రామాలలో మత్స్య సంపద అభివృద్ధి చేయుటకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రాధాన్యం ఇస్తున్నాయని రంపచోడవరం శాసనసభ్యురాలు, రాష్ట్ర ఎస్టీ సంక్షేమ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి పేర్కొన్నారు. రంపచోడవరం మండలం ముసురుమిల్లి జలాశయంలో గురువారం చేప పిల్లలు వదిలే కార్యక్రమానికి శాసనసభ్యురాలు శిరీష దేవి, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీష దేవి మాట్లాడుతూ గిరిజనులు జలాశయాలు సొసైటీల ద్వారా దర్తీ ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష అభియాన్ పథకం ద్వారా గిరిజన మత్స్య రైతులకు 90 శాతం సబ్సిడీపై ముసురుమిల్లి, నేలకోట, మగలిగడ్డ, బండ కొండ, సూరంపాలెం జలాశయాలలో రెండు లక్షల74 వేల 500 చేప పిల్లలు అందించడం జరిగిందన్నారు. మత్స్య సంపద అభివృద్ధి చెందే విధంగా చేప పిల్లలను జలాశయాలలో వదలడం జరిగిందన్నారు. గత ఫిబ్రవరి నెల ఏడో తేదీన పి ఎం ఎం యస్ వై పథకం ద్వారా పేజ్ వన్‌లో 60 వేల చేప పిల్లలను ఐదు జలాశయాలలో వదలడం జరిగిందని, మరలా జలాశయాల్లో 2వ విడతలో 79,800లు చేప పిల్లలను వదలడం జరుగుతుందన్నారు. పోలవరం జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ మాట్లాడుతూ పోలవరం జిల్లా పరిధిలోని గిరిజన మత్స్య రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. జలాశయాలలో గిరిజన మత్స్య రైతులు సొసైటీలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. గిరిజన రైతుల గ్రామాలు అభివృద్ధి చెందే విధంగా వచ్చిన ఆదాయంలో కొంత మొత్తం అభివృద్ధి కార్యక్ర మాలకు ఉపయోగించుకోవచ్చని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో పోలవరం జిల్లా మత్స్యశాఖ అధికారిని ఎస్.కె దిల్షాద్, డీఎఫ్సీఎస్ వైస్ ప్రెసిడెంట్ బోలా నాగేశ్వరరావు, ఎబ్డీవో ఎ.అనిల్ కుమార్, అబ్జర్వర్ టి. సంతోష్, విఎఫ్ఎలు, ఉమ్మడి ప్రభుత్వ నాయకులు స్వప్న కుమారి, అడబాల బాపిరాజు,గణపతి, ఫీల్డ్ మెన్,జలాశయాల కమిటీ ప్రెసిడెంట్లు, సభ్యులు పాల్గొన్నారు.

# సైబర్ భద్రతపై అవగాహన తప్పనిసరి






**– కాకినాడ 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి జి.ఆనంది**

**కాకినాడ,మేజర్‌న్యూస్ :** నేటి డిజిటల్ యుగంలో మహిళలు మరియు బాలికలు ఇంటర్నెట్‌ను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సైబర్ భద్రతపై అవగాహన అత్యంత అవసరమని కాకినాడ 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి జి.ఆనంది అన్నారు.జవహర్‌లాల్ నెహ్రూ టెక్నాలజికల్ యూనివర్సిటీ కాకినాడ పరిధిలోని యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, కాకినాడలో ఐఎస్ఈఎ ప్రాజెక్ట్ ఫేజ్ –3 ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని “ఐఎస్ఈఏ సెక్యూర్ హర్: ఏఐ థ్రెట్ అవేర్‌నెస్ అండ్ డిజిటల్ సేఫ్టీ ఫర్ ఉమెన్ అండ్ గర్ల్స్” అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని మార్చి 11, 2026న సాయంత్రం 5.00 గంటలకు అలుమ్ని ఆడిటోరియంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాకినాడ 3వ అదనపు జిల్లా మరియు సెషన్స్ జడ్జి జి.ఆనంది ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ కార్యక్రమానికి ఐఎస్ఈఏ ప్రాజెక్ట్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ మరియు సీనియర్ ప్రొఫెసర్ ప్రొఫెసర్ కె.వి. రమణ సమన్వయం వహించారు. ఆయన మాట్లాడుతూ, మహిళలు మరియు బాలికలు డిజిటల్ ప్రపంచంలో సురక్షితంగా ఉండేందుకు సైబర్ భద్రత, డేటా రక్షణ మరియు ఎఐ ఆధారిత ముప్పులపై అవగాహన కల్పించడం ఐఎస్ఈఏ ప్రాజెక్ట్ ముఖ్య లక్ష్యమని తెలిపారు. మహిళలు సాంకేతిక పరిజ్ఞానాన్ని ధైర్యంగా వినియోగించుకునేలా ఇటువంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని పేర్కొన్నారు.

ముఖ్య అతిథి జి.ఆనంది మాట్లాడుతూ, నేటి డిజిటల్ యుగంలో మహిళలు మరియు బాలికలు ఇంటర్నెట్‌ను విస్తృతంగా వినియోగిస్తున్న నేపథ్యంలో సైబర్ భద్రతపై అవగాహన అత్యంత అవసరమని అన్నారు. ఆన్‌లైన్ మోసాలు, సైబర్ వేధింపులు మరియు డిజిటల్ ముప్పుల నుండి రక్షణ పొందేందుకు మహిళలు చట్టపరమైన హక్కులు మరియు భద్రతా చర్యలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థంగా మరియు జాగ్రత్తగా వినియోగించుకోవడంద్వారా మహిళలు మరింత సాధికారతను పొందగలరని ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఎన్‌టీయూ కాకినాడ రెక్టర్ ప్రొఫెసర్ పి.సుబ్బారావు, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ కాకినాడ ప్రిన్సిపల్ ప్రొఫెసర్ కె.పద్మరాజు, వైస్ ప్రిన్సిపల్ (అడ్మినిస్ట్రేషన్) ప్రొఫెసర్ ఎం.స్వరూపారాణి మరియు ఐఎస్‌టి డైరెక్టర్ ప్రొఫెసర్ బి.టి. కృష్ణ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సైబర్ భద్రత, ఆన్‌లైన్ మోసాలు, సోషల్ మీడియా భద్రత మరియు ఎఐ ఆధారిత ముప్పుల నుంచి మహిళలు ఎలా రక్షించుకోవాలో నిపుణులు వివరిస్తూ అవగాహన కల్పించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమం ద్వారా మహిళలు మరియు బాలికల్లో డిజిటల్ భద్రతపై అవగాహన పెంపొందించడంతో పాటు సురక్షిత ఆన్‌లైన్ ప్రవర్తనకు ప్రోత్సాహం లభించిందని నిర్వాహకులు తెలిపారు.

# ఐటీడీఏ పిఓను కలిసిన ఎమ్మెల్యే,ఎస్టీ చైర్మన్





**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** పోలవరం జిల్లా రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్, ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్ ఇటీవల వివాహం చేసుకున్న సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ సోళ్ల బొజ్జి రెడ్డి, రంపచోడవరం ఎమ్మెల్యే, ఎస్టీ కమిటీ చైర్ పర్సన్ మిరియాల శిరీష దేవి వారిని కార్యాలయంలో గురువారం వేరువేరుగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో సాగాలని ఆకాంక్షించారు. అదేవిధంగా, చైర్మన్ బొజ్జిరెడ్డి ఇటీవల తాను సందర్శించిన గిరిజన ఆశ్రమ బాలురు, బాలికల పాఠశాలలకు బాత్ రూమ్ డోర్స్, ఆర్.ఓ వాటర్ ప్లాంట్‌లు మంజూరు చేసినందుకు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ ఆఫీసర్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ సౌకర్యం వల్ల గిరిజన విద్యార్థులకు స్వచ్ఛమైన త్రాగునీరు అందుబాటులోకి రావడం ఆనందకరమని ఆయన పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధితో పాటు విద్యార్థుల సంక్షేమానికి ఐటిడిఎ అధికారులు తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని చైర్మన్ అన్నారు.

**సమస్యలపై చర్చించిన ఎమ్మెల్యే..**

పోలవరం జిల్లాలోని మారుమూల గ్రామాలకు మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయుటకు రంపచోడవరం శాసన సభ్యురాలు మిరియాల శిరీష దేవి రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, పోలవరం ఇంచార్జ్ జిల్లా జాయింట్ కలెక్టర్ బచ్చు స్మరణ్ రాజ్‌తో చర్చించడం జరిగింది. పోలవరం జిల్లాలో 12 మండలాల పరిధిలోని గ్రామాల అభివృద్ధికి, ఈ వేసవి కాలంలో త్రాగునీటి సమస్యలు లేకుండా త్రాగునీరు అందించే విధంగా చూడాలని, అదేవిధంగా రహదారుల అభివృద్ధిపై ఎమ్మెల్యే చర్చించడం జరిగింది.

# లెప్రసి రోగులకు అండగా సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్





**– లెప్రసీ ఆసుపత్రి భూములు అన్యాక్రాంతం కాకుండా చర్యలు**

**రామచంద్రపురం, మేజర్ న్యూస్ :** రామచంద్రపురంలోని లెప్రసీ వ్యాధిగ్రస్తులు చేస్తున్న ఆందోళనకు సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్, కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం అండగా నిలిచారు. లెప్రసీ రోగుల ఆసుపత్రి నిర్మాణం కోసం దానం చేసిన భూమిని కొందరు అన్యాక్రాంతం చేస్తున్నారంటూ లెప్రసీ వాళ్ళు చేస్తున్న శిబిరాన్ని సందర్శించి, వారి సమస్యలు అడిగి తెలుసుకుని అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

రామచంద్రపురంలో గల లెప్రసీ ఆసుపత్రి కి సంబంధించిన భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని కోరుతూ కుష్టి వ్యాధిగ్రస్తుల జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గత కొద్ది రోజులుగా స్థానిక లెప్రసీ ఆసుపత్రి ఎదుట శిబిరాన్ని ఏర్పాటు చేసి ధర్నా, ఆందోళన నిర్వహిస్తున్నారు.

ఈ నేపథ్యంలో వాసంశెట్టి సత్యం, కూటమి నాయకులతో కలిసి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు తమ సమస్యను విన్నవిస్తూ టి ఎల్ ఎం సంస్థకు చెందిన లెప్రసి ఆసుపత్రిని పునః ప్రారంభించి, లెప్రసీ రోగులకు వైద్య సేవలు అందించాలని, ఆ భూముల్లో ఉన్న చెట్లను నరికి అక్రమంగా తరలించుకుపోయిన నిందితులపై చర్యలు తీసుకోవాలని, భూములను అన్యాక్రాంతం కాకుండా చూడాలని, ఈ ఆవరణలో ఉన్న చర్చి ని తెరిపించాలని వాసంశెట్టి సత్యం కు విన్నవించగా స్పందించిన వాసంశెట్టి సత్యం స్థానిక తహసిల్దార్ బండి మృత్యుంజయరావు, మున్సిపల్ కమిషనర్ కె.వి.రాజు, అటవీశాఖ అధికారులతో మాట్లాడారు. అక్రమంగా తరలించకపోయిన వ్యక్తులపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని, 22 (ఎ) లో ట్రస్టు భూములు పరిరక్షించాలని కోరారు. అలాగే ఈ విషయాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ దృష్టికి తక్షణమే తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తాను అన్నారు. వారం రోజులు లోగా డిమాండ్‌లన్ని పరిష్కరించేందుకు కృషి చేస్తానని వాసంశెట్టి సత్యం హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. తమ సమస్యల పట్ల స్పందించిన వాసంశెట్టి సత్యంకు కుష్టువ్యాధిగ్రస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఉండవెల్లి శివ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జాస్తి విజయలక్ష్మి, క్లస్టర్ ఇంచార్జ్ కంచుమర్తి బాబురావు, కూటమి పార్టీ నాయకులు, కుష్టి వ్యాధిగ్రస్తుల జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చింతకాయల పేటలో అమ్మవార్ల ఆలయ ప్రతిష్ట మహోత్సవం

**– ముఖ్య అతిథిగా హాజరైన ప్రభుత్వ విప్ యనమల దివ్య**





**తొండంగి, మేజర్ న్యూస్ :** చింతకాయల పేట గ్రామంలో గంగపుత్రుల ఆరాధ్య దైవాలైన శ్రీ భూలోక అమ్మవారు, నత్తకళ్ళు అమ్మవారు, భాగిర్త అమ్మవారు, మరియు బంగరమ్మ అమ్మవార్ల ఆలయ ప్రతిష్టా మహోత్సవం గురువారం అత్యంత అంగరంగ వైభవంగా జరిగింది. సముద్ర వేటపై ఆధారపడే మత్స్యకారుల చిరకాల వాంఛ అయిన ఈ ఆలయ నిర్మాణం గతంలో నిధుల కొరతతో సగంలోనే నిలిచిపోయింది. మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు చొరవతో, స్థానికుల విన్నపం మేరకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ సుమారు రూ.40 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అప్పగించింది. శుభ ముహూర్తం వేళ వేద పండితుల మంత్రోచ్చారణల నడుమ అమ్మవార్ల విగ్రహ ప్రతిష్ట శాస్త్రోక్తంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ శ్రీమతి యనమల దివ్య, సీనియర్ నేత యనమల రాజేష్‌తో కలిసి హాజరయ్యారు. ఆలయ నిర్వాహకులు ఆమెకు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. గ్రామాల్లో మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ఎమ్మెల్యే దివ్యకు బ్రహ్మరథం పట్టారు. అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించిన అనంతరం ఎమ్మెల్యే యనమల దివ్య తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆధ్యాత్మికతతో పాటు సామాజిక బాధ్యతగా ఆలయ నిర్మాణానికి సహకరించిన అరబిందో ఫౌండేషన్‌ను మరియు కృషి చేసిన చొక్కా అప్పారావును అభినందించారు. మండల టీడీపీ అధ్యక్షుడు చొక్కా అప్పారావు, చొక్కా మహంకాళి మరియు అరబిందో ప్రతినిధుల ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు ముగిసిన అనంతరం భారీ ఎత్తున మహా అన్నసమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు, స్థానిక నాయకులు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రజలు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి, గ్రామ అభివృద్ధికి తోడ్పడాలి

**– ఎస్సై శివకుమార్**

**– ఎవరెస్టు శిఖరం అధిరోహించిన వ్యక్తికి ఘన సన్మానం**





**రాజవొమ్మంగి. మేజర్ న్యూస్ :** జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్, రంపచోడవరం ఇన్చార్జి ఏఎస్పీ బి హేమంత్ ఆదేశాల మేరకు, సీఐ గౌరీశంకర్ సూచనలతో రాజవొమ్మంగి ఎస్ఐ శివకుమార్ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని నెల్లిమెట్ల గ్రామంలో పోలీసు చట్టాలు, సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాలు నివారణ వంటి వాటిపై అవగాహన సదస్సు గ్రామ ఆదివాసీ నేత టి.సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ గ్రామస్తులతో మాట్లాడారు. వారికి పలు ముఖ్యమైన అంశాలపై అవగాహన కల్పించారు. ఉద్యోగాల పేరుతో మోసాలు ఎలా జరుగుతున్నాయో వివరించి అలాంటి మోసపూరిత ఉద్యోగ ప్రకటనల పట్ల జాగ్రత్తగా ఉండాలన్నారు. అలాగే బాల్య వివాహాల వలన జరిగే అనర్థాల గురించి వివరించారు. అటువంటి వివాహాలను నిరోధించాల్సిన అవసరాన్ని వివరించారు. పొలాలలో అక్రమంగా విద్యుత్ తీగలు ఏర్పాటు చేయడం వల్ల జరిగే ప్రమాదాలు, చట్టపరమైన పరిణామాలు, రహదారి భద్రత, వాహనాలు నడిపే నిబంధనలు,హెల్మెట్ వాడకం,మహిళల భద్రత కోసం రూపొందించిన శక్తి యాప్ ఉపయోగం ఎలా ఉండాలో,ఎలా రిజిస్టర్ కావాలో అత్యవసర సమయంలో ఎలా ఉపయోగించాలో వివరించారు. ఎన్‌డీపీఎస్ చట్టం ప్రకారం మాదక ద్రవ్యాల తయారీ,నిల్వ,రవాణా, వినియోగం వంటి కార్యకలాపాలలో పాల్గొనడం వల్ల తీవ్రమైన శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఇటువంటి నేరాలకు దూరంగా ఉండాలని, చట్టాన్ని గౌరవించాలని సూచించారు. గ్రామస్తులు గంజాయి నాటుసారా క్రయ, విక్రయాలు నేరమని అటువంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. పేకాట, గుండాట, కోడిపందాలు వంటి అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి బాగా చదువుకొని ఉద్యోగ అవకాశాలను అందుపుచ్చుకొని గ్రామ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం గ్రామ యువతకు వాలీబాల్ కిట్టు పంపిణీ చేశారు. 2018లో నెల్లిమెట్ల గ్రామానికి చెందిన బి ప్రసన్నకుమార్ ఎవరెస్టు శిఖరం ఎక్కి ఏజెన్సీకి పేరు ప్రఖ్యాతలను తెచ్చిన నేపథ్యంలో ఎస్సై శివకుమార్, సిబ్బంది, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. అనంతరం గ్రామానికి విచ్చేసిన ఎస్ఐ శివకుమార్‌ను ఆదివాసీ సంఘాల నాయకులు, గ్రామస్తులు, మహిళలు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చూస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ఆదివాసి జేఏసీ జిల్లా నాయకులు వంతు బాలకృష్ణ, వైద్య సిబ్బంది రాజబాబు, గ్రామస్తులు మహిళలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# నిర్ణీత గడువులోగా పన్నులు చెల్లించాలి

**– ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** నిర్ణీత గడువులోగా పెద్దాపురం మండలంలోని 23 గ్రామాల పరిధిలో గల ఇంటి పన్నుదారులు పాత బకాయిలతో సహా మొత్తం చెల్లించి గ్రామ పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని, ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖరరెడ్డిలు తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో స్థానిక విలేఖరులతో మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీలలో 2025-26 సంవత్సరానికి ఇంటి, ఇతర పన్నులు, గత సంవత్సరాల బకాయిలతో కలసి మొత్తం చెల్లించవలసిన బకాయిలను పంచాయతీ సెక్రటరీలకు, సచివాలయ సిబ్బందికి వెంటనే చెల్లించాలని, వారు తెలిపారు. పన్నులు చెల్లించని వార్కి పారిశుద్య నిర్వహణ, చెత్త సేకరణ, వీధి దీపాల నిర్వహణ, గ్రామ పంచాయతీలు జారీ చేసే ధృవపత్రాలు, ఇతర సేవలను జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిలిపివేయడం జరుగుతుందని, కావున ఇంటి పన్నుదారులు త్వరితగతిన పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని వారు తెలిపారు.

# రక్షిత మంచినీరు కలుషితం..

**– పట్టించుకోని అధికారులు..**



**ఏలేశ్వరం, మేజర్ న్యూస్ :** పంచాయతీ నుండి నగర పంచాయతీగా రూపాంతరం చెందిన ఏలేశ్వరం నగర పంచాయతీ అభివృద్ధి పేరుతో పన్నుల రూపంలో ప్రజల నుండి ముక్కు పిండి మరీ వసూలు చేస్తున్న అధికారులకు త్రాగునీరు వృధాగా పోతున్న కలుషితం అవుతున్న వారి కంటికి కనబడలేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నగర పంచాయతీగా రూపాంతరం చెందిన ఏలేశ్వరం పట్టణం లో త్రాగునీటి పైపులు 16 చోట్ల ముఖ్యంగా సువ్వయం పేట (కుమ్మర వీధి) లో డ్రైనేజీల నుండి వెళ్లడంతో ఆ పైపులకు లీకులు ఉండడం వల్ల డ్రైనేజీ నుండి వచ్చే మురుగునీరు త్రాగునీటితో కలిసిపోవడంతో అదే నీరు స్థానిక ప్రజలు త్రాగడం ద్వారా అనేక రోగాల బారిన పడుతున్నట్లు అక్కడి ప్రజలు ఆరోపిస్తున్నారు. కుళాయిల నుండి వచ్చే త్రాగునీరు నియంత్రణ లేకపోవడంతో ఆ నీరు వృధాగా పోవడం గమనార్హం. అయినా అధికారులకు కనపడని గుసగుసలు వినిపిస్తున్నాయి. పట్టణ పరిధిలో సుమారు 386 పబ్లిక్ కుళాయిలు ఉండగా అందులో 50 శాతానికి పైగానే ట్యాపులు లేకపోవడంతో త్రాగునీరు వృధాగా పోతూనే ఉంది. ఇక మురుగు కాలవ లో వెళ్లే పైపులు ద్వారా మురుగునీరు త్రాగునీరు కలిసిపోవడంతో అదే నీరును ప్రజలు తీసుకోవడంతో అలాగే ఇబ్బందులకు గురైన సంఘటనలు కోకొల్లలు. నగర పంచాయతీకి పన్నుల రూపంలో ఆదాయం వస్తున్న అభివృద్ధి మాత్రం ఆమడ దూరంలోనే ఉందని స్థానిక ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇకనైనా రానున్న వేసవికాలం దృష్టిలో ఉంచుకుని త్రాగునీరు పైపులకు మరమ్మత్తులు చేపట్టడంతో పాటు కుళాయిలకు ట్యాప్ లు అమర్చినట్లయితే త్రాగునీరు వృధాగా పోకుండా ఉంటుందన్నారు. అలాగే నగర పంచాయతీ అధికారులకు పన్నుల వసూలు పై ఉన్న శ్రద్ధ ప్రజారోగ్యంపై లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ఎప్పటికే నగరంలో వాంతులు, విరేచనాలు, జ్వరం వంటి లక్షణాలతో పలు ప్రైవేటు ప్రభుత్వ ఆసుపత్రులలో పెద్ద ఎత్తున రోగులు చికిత్స పొందుతున్నారు. ప్రధానంగా 10 సంవత్సరాలలో పిల్లలకు కలుషిత నీరు త్రాగడంతో ఈ వ్యాధుల బారిన పడినట్లు వైద్యులు సూచిస్తున్నారు. చిన్న నిర్లక్ష్యం ఒక ప్రాణం ఖరీదని అధికారులు గుర్తెరిగి బాధ్యతగా వ్యవహరించాలని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రక్షిత మంచినీటి విడుదలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి ప్రజారోగ్యం కాపాడాలని పలువురు కోరుతున్నారు.

## ఉపాధి పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదిక



**రంపచోడవరం, మేజర్ న్యూస్ :** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా 2024-2025 సంవత్సరానికి సంబంధించి రంపచోడవరం మండలానికి సంబంధించి సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించడం జరిగిందని పోలవరం జిల్లా ఏపిడి వెంకటేశ్వరరావు తెలిపారు. రంపచోడవరం ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమానికి పోలవరం జిల్లా ఏపీడి వెంకటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఆర్థిక సంవత్సరం 2024 -25 సంవత్సరానికి రంపచోడవరం మండలంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో జరిగిన పనులకు, వేతన దారులు చేసిన పనికి వేతనాలు సక్రమంగా అందినవి లేనివి, పనులకు సంబంధించిన గ్రామ సభ చేసిన తీర్మానాలు ఉన్నది లేనిది రంపచోడవరం మండలంలోని వివిధ గ్రామాలకు సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) నిర్వహించడం జరిగిందన్నారు. నేరుగా గ్రామాలకు వెళ్లి రికార్డులో ఉన్న పనులు, అదేవిధంగా వేతనదారులు పనిచేసిన దానికి వేతనాలు సక్రమంగా అందినవి లేనివి, నిధులు వినియోగంపై సోషల్ ఆడిట్ నివేదికలు సమర్పించడం జరిగిందని, ఈనివేదికలు ఆధారంగా సామాజిక తనిఖీ ప్రజా వేదిక ద్వారా తనిఖీ నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.డీ.వో పి.వి.వి.సి.ప్రసాద్, వైస్ ఎం.పి.పిలు బాలకృష్ణ, కుంజం వంశీకృష్ణ, ఎం.పీ.టీ.సీ ఉలవల లక్ష్మి, డిపిఎం దుర్గాప్రసాద్, ఏపిఓ బి.సత్యనారాయణ, ఏపీడి రాంబాబు, ఎస్ఆర్పి అచ్యుతరావు, టెక్నికల్ అసిస్టెంట్లు, డిఆర్పీలు పాల్గొన్నారు.

## ప్రభుత్వాసుపత్రిని సందర్శించిన కాయకల్ప టీమ్



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణంలో గల ప్రభుత్వాసుపత్రిని గురువారం రాష్ట్ర కాయకల్ప టీమ్ సభ్యులు సందర్శించి పరిశీలించడం జరిగింది. రాష్ట్ర టీమ్ సభ్యులు డా.ఆర్.నరేష్ (ప్రోగ్రామ్ ఆఫీసర్ ఎబిడిఎం) డా.పి.సురేష్ (పి.ఎం.ఎ.బి.హెచ్.ఐ.ఎం) వీరికి ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డా.ఉమ మహేశ్వరి, డా.శ్రీ విద్య, డా.రాజ్ కుమార్, డా.జగదాంబ, డా.గోపి, డా.సుబ్బారావులు వీరికి స్వాగతం పలికారు. అనంతరం ప్రభుత్వాసుపత్రిలోని వార్డులు పరిశీలించడంతో పాటు రోగులతో మాట్లాడారు. ఆసుపత్రి పరిసరాలును, మందులు ఇచ్చే విధానాన్ని, ఫార్మసి విభాగాన్ని, శానిటేషన్, ఓపి విధానం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ రమాదేవి, ఆసుపత్రి సిబ్బంది ఫార్మసిస్ట్ కమలకుమారి, పద్మజ, పలువురు వైద్య సిబ్బంది ఉన్నారు.

## ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌ను ప్రారంభించిన కమీషనర్



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పురపాలక సంఘం పరిధిలో య్ ు ు టి ఎ ఎ్ ఆధ్వర్యంలో ఎన్‌రోల్ మెంట్ స్పెషల్ డ్రైవ్‌ను మున్సిపల్ కమీషనర్ కె.శ్రీకాంత్‌రెడ్డి, డివైఇఓ ఈ.ప్రభాకర శర్మలు ప్రారంభించి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల యొక్క ఆవశ్యతను ప్రజలందరికి తెలియజేయాలని, అలాగే బడి ఈడు కలిగిన పిల్లలందరిని ప్రభుత్వ స్కూల్స్‌లో తప్పనిసరిగా జాయిన్ చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు యుటిఎఫ్ టీచర్లు, తదితరులు పాల్గొన్నారు.

# పాడైన బోరుతో 5 వార్డుల ప్రజలకు త్రాగునీటి ఇక్కట్లు



**సామర్లకోట, మేజర్ న్యూస్ :** సామర్లకోట మున్సిపాలిటీలో బ్రౌన్‌పేట సెంటర్లోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్కులో ఉన్న బోరు పాడవడంతో గత రెండు రోజులుగా ఐదు వార్డులకు చెందిన ప్రజలు నీటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఉదయం కుళాయిల ద్వారా ఇచ్చే రక్షిత మంచినీరు కేవలం అరగంట గంట సమయం మాత్రమే ఇస్తుండగా తదుపరి ప్రజలు ఇతర అవసరాల కోసం ఈ బోరు నుంచి సరఫరా జలాలనే ఉపయోగించుకుంటూ వస్తున్నారు. ప్రధానంగా మున్సిపాలిటీ పరిధిలోని దళిత వార్డులైన 2,3,4,5,6 వార్డులకు చెందిన ప్రజలకు ఈ బోరే ఆధారంగా నిలుస్తోంది. అయితే రెండు రోజుల క్రితం ఈ బోరు రిపేరుకు గురి కావడంతో ఈ వార్డులకు చెందిన ప్రజలు నీటి కోసం అల్లాడుతున్నారు. ఈ విషయంలో అధికారులు గురువారం సాయంత్రం బోరు రిపేరు పనులకు చర్యలు చేపట్టగా బోరు రిపేరు పూర్తికావడానికి మరో నాలుగు రోజులు సమయం పట్టే అవకాశం ఉందని సమాచారం.అసలే వేసవికాలం కావడంతో రక్షిత మంచినీరు పూర్తిస్థాయిలో అందకపోగా తదుపరి అందించే బోరు నీరు సైతం నిలిచిపోవడంతో ఆయా వార్డులకు చెందిన ప్రజలు నీటి కోసం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ వార్డులో నీటి కొరత తీర్చేందుకు మున్సిపల్ అధికారులు తక్షణం స్పందించి బోరు రిపేరు పనులు పూర్తయ్యేంతవరకు ట్యాంకర్ల ద్వారా నీటిని ప్రజలకు అందించాలని నాలుగోవార్డ్ కౌన్సిలర్‌పిట్టాసత్యనారాయణ అధికారులను కోరుతున్నారు. అలాగే బోరు రిపేరు పనులను సాధ్యమైనంత తొందరగా పూర్తి చేయడంతో పాటు డాక్టర్ అంబేద్కర్ పార్కులో ఏర్పాటుచేసిన వాటర్ ప్లాంట్ ను వినియోగంలోనికి తీసుకువచ్చి ప్రజల త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని ఈ సందర్భంగా కౌన్సిలర్ సత్యనారాయణ, ప్రజలు అధికారులను కోరుతున్నారు.

# బాల్య వివాహం అడ్డుకున్న అధికారులు

**పిఠాపురం, మేజర్ న్యూస్ :** పిఠాపురం స్థానిక కత్తులగూడెంలో జరగబోయే బాల్యవివాహాన్ని గురువారం అధికారులు అడ్డుకున్నారు. పట్టణానికి చెందిన మైనర్ బాలికకు (14) గుంటూరుకి చెందిన వ్యక్తితో అన్నవరంలో ఈనెల14వ తేదీన వివాహం చేసేందుకు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో బాల్య వివాహం జరుగుతుందని సమాచారం అందుకున్న ఐసిడిఎస్, బాలల పరిరక్షణ విభాగం అధికారులు మైనర్ బాలిక ఇంటి వద్దకు చేరుకొని కుటుంబ సభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం బాలికను స్థానిక పోలీసుల సహాయంతో కాకినాడలోని బాలల సంరక్షణ గృహానికి తరలించారు.

# సమాజంలో మహిళల పట్ల గౌరవంతో మెలగాలి

పిఠాపురం, మేజర్ న్యూస్ : సమాజంలో మహిళల పట్ల గౌరవం, బాధ్యతాయుతమైన ప్రవర్తన కలిగిన 'సానుకూల పురుషత్వం' అలవరుచుకున్నప్పుడే ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పిఠాపురం ఐ.సి.డి.ఎస్. ప్రాజెక్ట్ సి.డి.పి.ఓ. సిహెచ్.ఎస్.కె. దుర్గాదేవి, బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకల సందర్భంగా... మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిహెచ్. లక్ష్మి ఆదేశాల మేరకు పిఠాపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సి.డి.పి.ఓ. దుర్గాదేవి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ పలు కీలక అంశాలను వివరించారు. పురుష విద్యార్థులు మహిళల పట్ల సానుకూల దృక్పథంతో ఉండాలని, లింగ వివక్ష లేని సమాజం కోసం కృషి చేయాలని కోరారు. ప్రస్తుత కాలంలో యువత సైబర్ నేరాల ఉచ్చులో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను, సామాజిక మాధ్యమాల్లో మహిళల భద్రతకు ఉన్న చట్టాలను వివరించారు. బాలల హక్కుల రక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులందరితో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు.




సమాజంలో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ,వాటిని అడ్డుకోవడంలో యువత పాత్ర కీలకమని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ విభాగం కౌన్సిలర్ బి. దుర్గారాణి, ఐ.సి.డి.ఎస్. సూపర్వైజర్ వీరలక్ష్మి, కళాశాల ప్రిన్సిపల్ పి.సుభాషిణి,కళాశాల అధ్యాపక సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కిడ్నీల భద్రతకు మెరుగైన ఆహార నియమాలు తప్పనిసరి

– డాక్టర్ మహేష్



అడ్డతీగల, మేజర్ న్యూస్ : మానవ శరీరంలో మూత్రపిండాల భద్రతకు వాటి పనితీరు మెరుగుదలకు మెరుగైన ఆహార నియమాలు కచ్చితంగా పాటించాలని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రి వైద్యుడు మహేష్ అన్నారు. గురువారం ప్రపంచ మూత్రపిండాల దినోత్సవంలో భాగంగా ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు వారి బంధువులకు మూత్రపిండాల పరిరక్షణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మహేష్ మాట్లాడుతూ మూత్రపిండాల పనితీరు మెరుగైన భద్రత ప్రతి ఒక్కరి చేతుల్లోనే ఉందని ప్రతి రోజు తగినంత నీరు త్రాగడం ఉప్పు వాడకాన్ని తగ్గించడం క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల మూత్రపిండాలు ఆరోగ్యంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆసుపత్రి కౌన్సిలర్ నారే వాసు మాట్లాడుతూ ప్రతిరోజు ఆహారంలో పండ్లు, ఆకుకూరలు , తాజా కూరగాయలు, చిరుధాన్యాలు ఎక్కువగా తీసుకోవడం వల్ల మూత్రపిండాలను కాపాడుకోవచ్చని సూచించారు. మరో వైద్యులు అనూష శ్రీహర్ష ప్రసన్న మాట్లాడుతూ ప్రతి మనిషి రక్తపోటు మధుమేహం వంటి వ్యాధులను ఎప్పటికప్పుడు నియంత్రణలో ఉంచుకోవడం వల్ల కిడ్నీలపై భారం తగ్గుతుందని అందువల్ల ప్రతి మనిషి ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడుతుందని పేర్కొన్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడ్డతీగల గ్రామస్తులతో పాటు ఆసుపత్రి సిబ్బంది ఊహ, దేవుడు, వెంకటలక్ష్మి, సునీత , శాంతి, విజయ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌పిజి సరఫరాపై నిరంతర నిఘా




**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం పట్టణ, మండల పరిధిలో గల ఎల్‌పిజి గ్యాస్ సిలిండర్ల సరఫరాపై జిల్లా ఉన్నతాధికారులు, తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీల ఆదేశాల మేరకు నిరంతర నిఘా ఉంటుందని, పెద్దాపురం ఎంఎస్ఓ భారతి అన్నారు. గురువారం పెద్దాపురం పట్టణంలోని శ్రీ గాయత్రి, శ్రీ గంగా హెచ్‌పి, భారత్ గ్యాస్, శ్రీ లలిత హెచ్‌పిగ్యాస్ కార్యాలయాల వద్ద ఆమె బుకింగ్, సిలిండర్లు నిల్వలును పరిశీలించి ఉన్నతాధికారుల సూచనలను వారికి తెలియజేశారు. ఈ నాలుగు గ్యాస్ కంపెనీల ఆధ్వర్యంలో సుమారు 60వేల గ్యాస్ కనెక్షన్‌లు ఉన్నాయని, గ్యాస్ వినియోగదారులుకు బుకింగ్‌కు, డెలివరికి ఇబ్బంది లేకుండా డీలర్లు చర్యలు తీసుకోవాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ గంగా హెచ్‌పి ఎండి తలాటం గంగాధరరావు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీశ్రీ నూకాలమ్మ జాతర నిర్వహణ సమన్వయ సమావేశం

**– పాల్గొన్న పలువురు అధికారులు**



**పెద్దాపురం రూరల్, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ ఎన్.శ్రీధర్ ఆధ్వర్యంలో పెద్దాపురం మండలం, కాండ్రకోట గ్రామంలో వేంచేసియున్న శ్రీశ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవములు ఈ నెల 17వ తేది నుండి మే3 వరకు నిర్వహించనున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులతో కోఆర్డినేషన్ సమావేశం గురువారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ శ్రీధర్ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని, దేవదాయ సిబ్బందితో పాటు, ఆయా శాఖల అధికారులకు ఆయన సూచించారు. ఈ సమావేశంలో తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మి, ఎంపిడిఓ కె.వి.సూర్యనారాయణ, దేవదాయ శాఖ ఇఓ రాంబాబురెడ్డి, డిప్యూటి ఎంపిడిఓ జి.వి.శేఖరరెడ్డి, ఎస్సై వి.మౌనిక, డిప్యూటి డిఎం & హెచ్ఓ డా.ప్రశాంతి, విద్యుత్, ఇరిగేషన్, ఫైర్, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## సీనియర్ సిటిజన్స్ చట్టంపై అవగాహన



**పెద్దాపురం, మేజర్ న్యూస్ :** పెద్దాపురం ఆర్డీఓ కార్యాలయంలో గురువారం హెల్ప్ ఏజ్ ఇండియా డిల్లి వారి ఆధ్వర్యంలో కోఆర్డినేటర్ పి.శ్యామ్ పర్యవేక్షణలో సీనియర్ సిటిజన్స్ చట్టం 2007 మరియు 2012 రూల్స్ గురించి వర్క్ షాప్ నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ పి.శ్రీనివాస్, ఉపాధ్యక్షులు ఎస్.గౌరీనాయుడు, ఆర్.సుధాకర్‌లు మాట్లాడుతూ సీనియర్ సిటిజన్స్‌కు ఏర్పాటు చేసిన పలు సేవలను, వారికి వచ్చు సమస్యలను వివరించడంతో పాటు, ఆర్‌టిసి బస్‌లలోలో వృద్ధులకు ప్రత్యేకంగా సీట్లు కేటాయించాలని, వృద్ధులు బస్‌లు ఎక్కేటపుడు వారికి వీలుగా మెట్లు అందుబాటులో ఉండాలని వారు కోరారు. 70 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ప్రధానమంత్రి ఆయుష్మాన్ కార్డులు ఇచ్చారని, వాటిని రూ.5లక్షల వరకు వైద్య సదుపాయం ఉపయోగించవలసినదిగా వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కార్యాలయ ఏఓ మాధవరావు, సీనియర్ సిటిజన్స్ ఆఫీస్ సూపరింటెండెంట్ రాజు, ట్రెజరర్ రామ సుబ్బారావు, సీనియర్ సిటిజన్ అధ్యక్షులు భళ్ళమూడి సూర్యనారాయణ, ఇతర సీనియర్ సిటిజన్స్ పాల్గొన్నారు.

## టూరిస్ట్ బస్సు యజమానుల ఆవేదన

# పన్నుల భారం..అక్రమ రవాణా సెగ !

- పెరిగిన త్రైమాసిక పన్నుతో కుదేలవుతున్న చిరు వ్యాపారులు
- స్కూల్, కాలేజీ బస్సుల అక్రమ కార్యకలాపాలతో భారీ నష్టం
- ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఏపీ టూరిస్ట్ బస్సు ఓనర్స్ అసోసియేషన్ విన్నపం
- స్కూల్ కాలేజీ బస్సులు అక్కడ ప్రయాణం వల్ల భీమ వర్తించదు!

**సూర్య బ్యూరో – ఉమ్మడి గోదావరి జిల్లాలు :**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో టూరిస్ట్ బస్సు రంగం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోతోంది. ఒకవైపు ప్రభుత్వం ప్రతిపాదించిన కొత్త పన్నుల భారం, మరోవైపు నిబంధనలకు విరుద్ధంగా సాగుతున్న స్కూలు, కాలేజీ బస్సుల వాణిజ్య కార్యకలాపాలు తమ ఉపాధిని దెబ్బతీస్తున్నాయని టూరిస్ట్ బస్సు యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ టూరిస్ట్బస్సుఓనర్స్ అసోసియేషన్ మరియు తూర్పు గోదావరి జిల్లా అసోసియేషన్ ప్రతినిధులు తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. కాకినాడ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ కె. శ్రీధర్‌కి జిల్లా అసోసియేషన్ గురువారం అందజేసిన వినతిపత్రంలో ప్రధానంగా స్కూల్, కాలేజీబస్సులవల్ల జరుగుతున్న నష్టాన్ని వివరించారు. విద్యా సంస్థల బస్సులు కేవలం రూ. 100/– సీటు చొప్పున నామమాత్రపు పన్ను చెల్లిస్తూ,ఆనిబంధనలను అతిక్రమించి పెళ్లిళ్లకు, విహార యాత్రలకు బస్సులను అద్దెకు తిప్పుతున్నాయని వారు అధికారుల దృష్టికి తెచ్చారు. దీనివల్ల టూరిస్ట్ ఆపరేటర్లు తీవ్రంగా నష్టపోతున్నారని, నిబంధనలు ఉల్లంఘిస్తున్న అటువంటి బస్సులపై తక్షణమే తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని, జరిమానాలు విధించాలని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పెదబాబు, కార్యదర్శి శివరామ్ డి.సి.టి.సి. ని కోరారు.



**బీమా వర్తింఛదు.. ప్రమాదం జరిగితే అంతే!**

ఎవరైతే స్కూల్ బస్సులని నిబంధనలకు వ్యతిరేకంగా పెళ్లిళ్లకు ఇతర అవసరాలకు కేటాయిస్తున్నారో, అటువంటి వారు గుర్తించాల్సింది ఏంటంటే స్కూల్ మినహా ఏ ఇతర అవసరాలకు కూడా ఆ బస్సులలో ప్రయాణించకూడదు. అటువంటి సమయాల్లో ప్రమాదవశాత్తు ప్రమాదాలు జరిగితే ప్రయాణిస్తున్న ప్రయాణికులకు ఎటువంటి బీమా వర్తించదు. దీనివల్ల రేపు పొద్దున ప్రభుత్వానికి కూడా ప్రశ్నించే పరిస్థితి వస్తుంది. భారీ ప్రమాదం జరిగి ఆ బీమా లేని బస్సులో పదుల సంఖ్యలో చనిపోతే, అందులో ప్రయాణించిన వారి కుటుంబ సభ్యులు అనాథల అవడమే కాకుండా ఎటువంటి పారితోషకం రాక, ఎవరిని అడగాలో తెలియక ప్రభుత్వాన్ని నిలదీసే పరిస్థితి ఏర్పడుతుంది. కాబట్టి అటువంటివి జరగకుండా ముందస్తు చర్యగా స్కూల్ బస్సులను కేవలం స్కూల్ అవసరాలకే వాడాలని, ఇతర వాటికి ఎట్టి పరిస్థితిలో వాడకుండా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అసోసియేషన్ డిమాండ్ చేస్తూ తెలియజేస్తుంది.

**పన్నుల మోత.. భరించలేమంటున్న యజమానులు**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఒక సీటుకు రూ. 1,000లు గా ఉన్న పన్ను, గత ప్రభుత్వ హయాంలో రూ. 1,120కు పెరిగింది. అయితే, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సవరణ'మోటార్ వెహికల్ టాక్సేషన్ బిల్లు – 2026' ద్వారా ఈ పన్నును ఏకంగా రూ. 1,500కు పెంచాలని ప్రతిపాదించడంపై యజమానులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర విస్తీర్ణం తగ్గినప్పటికీ పన్నులు పెంచడం మధ్యతరగతి వ్యాపారస్తులకు భారంగా మారిందని, పాత పద్ధతిలోనే పన్ను వసూలు చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

**స్కూల్ బస్సుల అక్రమ దందా!**

తమ వ్యాపారం దెబ్బతినడానికి ప్రధాన కారణం స్కూల్, కాలేజీ బస్సుల అక్రమ రవాణా అని అసోసియేషన్ ప్రతినిధులు ఆరోపిస్తున్నారు.

**– పన్ను మినహాయింపు దుర్వినియోగం:** విద్యార్థుల కోసం ప్రభుత్వం ఇచ్చే పన్ను మినహాయింపును అడ్డం పెట్టుకుని, స్కూల్ యాజమాన్యాలు పెళ్లిళ్లకు, విహార యాత్రలకు తమ బస్సులను కిరాయికి తిప్పుతున్నాయి.

**– అసమాన పోటీ:** టూరిస్ట్ బస్సులు ఒక సీటుకు రూ. 1,120లు పన్ను చెల్లిస్తుంటే, స్కూల్ బస్సులు కేవలం రూ. 100లు మాత్రమే చెల్లిస్తూ వాణిజ్య కార్యకలాపాలు సాగించడం అన్యాయమని వారు పేర్కొన్నారు. దీనివల్ల ఒక్కో బస్సుపై టూరిస్ట్ ఆపరేటర్లకు సుమారు రూ. 45,000లు వరకు నష్టం వాటిల్లుతోందని వాపోతున్నారు.

**ప్రభుత్వానికి అసోసియేషన్ విన్నపాలు:**

**–పన్ను తగ్గింపు** :త్రైమాసిక పన్నును పెంచే ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలి.

– అక్రమ రవాణాపై చర్యలు: పర్మిట్ నిబంధనలు ఉల్లంఘించి వాణిజ్య అవసరాలకు వాడుతున్న స్కూల్, కాలేజీ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలి.

**– సౌత్ జోన్ పర్మిట్:** పొరుగు రాష్ట్రాలతో సంప్రదింపులు జరిపి 'సౌత్ జోన్ పర్మిట్' ఇప్పించడం ద్వారా రాష్ట్ర పర్యాటక రంగం అభివృద్ధి చెందడమే కాకుండా, ప్రభుత్వానికి జీఎస్టీ రూపంలో భారీ ఆదాయం సమకూరుతుందని సూచించారు.

పర్యాటక రంగంపై ఆధారపడి వేలాది కుటుంబాలు జీవిస్తున్నాయని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈ విషయంలో చొరవ తీసుకుని తమకున్యాయంచేయాలని అసోసియేషన్ అధ్యక్షులు బి. అనీష్ బాబు,కార్యదర్శి కె. శివరామ్ మరియు ఇతర సభ్యులు కోరారు.

## మాకిరెడ్డి భాస్కర్

# ఆమరణ నిరాహార దీక్ష

### రైతు బజార్లో దళారీ రాజ్యం.. సామాన్యుడికి శాపం!

- ప్రక్షాళన చేయకుంటే వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం..
- కాకినాడలో సెగలు రేపుతున్న రైతు బజార్ వివాదం



**కాకినాడ,మేజర్‌న్యూస్ :** అది రైతుల కోసం.. రైతులే పండించి.. రైతులే అమ్మే 'రైతు బజార్'. కానీ, అక్కడ ఇప్పుడు రైతు కనిపించడం లేదు.. దళారీ రాజ్యమేలుతున్నాడు. సామాన్యుడికి చౌకగా కూరగాయలు అందడం అటుంచితే, స్థానిక నివాసితులకు నరకం చూపిస్తున్నారు. ఈ అరాచక వ్యవస్థపై గళమెత్తిన ఆంధ్రప్రదేశ్ 93 బీసీ కులాల ఐక్యవేదిక అధ్యక్షులు మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు, నేటి నుంచి ఆమరణ నిరాహార దీక్షకు సిద్ధమయ్యారు.

**లక్ష్యం నీరుగారింది.. లూటీ మొదలైంది!**

రైతు బజార్ ప్రారంభంలో కేవలం 250 మంది రైతులకు మాత్రమే అనుమతి ఉంది. తమపొలాల్లో పండించిన పంటను నేరుగా వినియోగదారులకు విక్రయించి లాభపడాలన్నది ప్రభుత్వ ఆశయం. కానీ, అధికారుల నిర్లక్ష్యం, రాజకీయ అండదండలతో ఈ సంఖ్య ఇప్పుడు 400 దాటిపోయింది. ఇందులో సగానికి పైగా రైతుల ముసుగులో ఉన్న దళారులేనని భాస్కర్ గణేష్‌బాబు తీవ్రంగా ఆరోపించారు.

**నివాసితుల 'నరకయాతన'**

ఈ అక్రమ వ్యాపారాల వల్ల రైతు బజార్ చుట్టుపక్కల ఉన్న సుమారు 50 నివాస గృహాల పరిస్థితి దారుణంగా మారింది.

**– రహదారుల ఆక్రమణ:** దళారీ రైతులు రోడ్లను ఆక్రమించి వ్యాపారం చేస్తుండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.

**– స్తంభించిన జనజీవనం:** పాఠశాలలకు వెళ్లే పిల్లలు, అత్యవసర వైద్యం అవసరమైన వృద్ధులు అడుగు బయట పెట్టలేని పరిస్థితి.

**–బెదిరింపులు:**ప్రశ్నించినస్థానికులను రాజకీయ బలంతో భయాందోళనలకు గురిచేస్తున్నారని మాకిరెడ్డి భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు.

**డిమాండ్లు ఇవే..** పరిమితికి మించిన అనుమతులు: అక్రమంగా చొరబడిన దళారీ వ్యాపారులను వెంటనే తొలగించాలి.

– నిజమైన రైతులే లక్ష్యం: కేవలం అర్హత ఉన్న రైతులకు మాత్రమే విక్రయాలకు అవకాశం కల్పించాలి.

– మౌలిక వసతులు: రైతులకు తగిన స్థలం, తాగునీరు, పారిశుద్ధ్య సౌకర్యాలు మెరుగుపరచాలి.

"ప్రభుత్వ యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. గతంలో ఇచ్చిన గడువు ముగిసినా అధికారుల్లో చలనం లేదు. అందుకే ప్రజల కోసం, నిజమైన రైతుల కోసం ప్రాణత్యాగానికైనా సిద్ధపడి ఈ దీక్ష చేపడుతున్నాను" అని ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయ సమావేశంలో మాకిరెడ్డి భాస్కర్ గణేష్‌బాబు గురువారం స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీం, జాగీర్, రాజ్వాల్, సురేష్, జాషువా తదితరులు పాల్గొని తమ మద్దతు ప్రకటించారు. భాస్కర్ గణేష్‌బాబు దీక్ష నిర్ణయంతో కాకినాడలో రాజకీయ వాతావరణం ఒక్కసారిగా వేడెక్కింది. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి రైతు బజార్‌ను ప్రక్షాళన చేస్తుందా? లేక వివాదాన్ని మరింత ముదిరేలా చూస్తుందో వేచి చూడాలి.

## డిజిటల్ పురోగతి,

# ప్రజా సంక్షేమమే లక్ష్యం

### కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసిన ఎంపీ సానా సతీష్ బాబు



**ఉమ్మడి గోదావరి జిల్లాల సూర్యబ్యూరో :** రాజ్యసభ సభ్యులు సానా సతీష్ బాబు గురువారం ఢిల్లీలో కేంద్ర సమాచార సాంకేతిక మరియు రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈసమావేశంలో ప్రధా నంగా దేశవ్యాప్తంగా సాగుతున్న డిజిటల్ విప్లవం, సాంకేతికతను సామాన్యుడికి చేరువ చేయడం వంటి కీలక అంశాలపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీ సతీష్ బాబు మాట్లాడుతూ, ప్రజా సంక్షేమ పథకాల అమలులో అత్యాధునిక సాంకేతికతను జోడించడం ద్వారాపారదర్శకత పెరుగుతుందని అభిప్రాయ పడ్డారు. దేశంలో డిజిటల్ పురోగతిని మరింత వేగవంతం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు. అలాగే, రైల్వే మరియు ఐటీ రంగాలలో ఉన్న అవకాశాలను అందిపుచ్చుకుని, రాబోయే రోజుల్లో సాంకేతికతను మరింత విస్తృతం చేసే దిశగా అడుగులు వేయాలని ఈ భేటీలో చర్చించినట్లు సమాచారం. ఈ సమావేశంలో ఐటీ మరియు రైల్వే రంగాలకు సంబంధించిన పలు కీలక అభివృద్ధి అంశాలపై కూడా వారు అభిప్రాయాలను పంచుకున్నారు.